# "డబ్బండీ బాబూ"

ఓ చిన్న కొంప కట్టుకోవాలనే కల సాకారమవుతోంది.

సగం కట్టి యింకా పని నడుస్తున్న ఇంటిముందూ నేనూ మా మోహనరావు బావా కూచుని మాట్లాడుకుంటున్నాం.

నేను డబ్బు సంచిని ఎక్కడో మరచిపోయినట్లు గుర్తొచ్చి వెదకి తెచ్చి ఒళ్లో పెట్టుకుని మళ్లీ మాటలు కొనసాగించసాగాను.

"డబ్బు అట్లా ఎక్కడపడితే అక్కడ వదిలేయకు. కూలీలూ, గౌండాలూ (తాపీ పనివాళ్లు) తీసేసే ప్రమాదం వుంది. వాళ్లందరూ అట్లాంటి వాళ్లే అనను... అనకూడదు కూడాను. కానీ దరిద్రం చాలా చెడ్డదయ్యా" అన్నారు మా మోహనరావు బావ.

డబ్బు లేమి గురించి... డబ్బు ప్రాముఖ్యం గురించి భర్తృహరి పద్యం గుర్తొచ్చింది నాకు.

"జాతి దొలంగుగాత గుణశక్తి రసాతల సీమకుం జనుం
గాత కులంబు బూదియగు గాత నగంబున నుండి శీలము
బాతము జెందుగాత బహు భంగుల విత్తమె మాకు మేలు వి
ఖ్యాత గుణంబులెల్ల దృణ కల్పములొక్క ధనంబు లేవడిన్"
జాతి పాతాళానికి పోయినా
సద్గుణాలంత కంటే జారినా
శీలమన్నది కొండెక్కి దూకినా
వంశం తగలబడిపోయినా
శీలమ్మీద పిడుగు పడ్డా

మాకేమీ కోపం లేదూ, మాకు డబ్బొక్కటుంటే చాలూ, అసలు డబ్బన్నది లేనప్పుడీ సుగుణాలన్నీ గడ్డిపోచ విలువ చేయవుగదా అని అర్థం.

మా బావతో ఆ విషయమై కాసేపు చర్చ జరిగింది. అప్పుడు మా బావ తన గతం గురించీ, తన డబ్బు లేక ఎట్లా అవస్థ పడిందీ చెప్పుకొచ్చారు.

మా యశోదక్కనిచ్చి ఆయనకు వివాహం చేసే సమయానికాయన ఆరండ్బీ ఇంజనీరుగా ఉన్నతమైన స్థాయిలో వున్నారు. ఆయన గతం గురించి ఆరా తీసే కుసంస్కారం మాకు లేదు గనుక ఆయన వెనకటి జీవితం గురించి నాకు తెలియదు.

ఇప్పుడు ఆయనే చెప్పుకొచ్చారు.

ఆయన పధ్నాలుగేళ్లకే ఎస్.ఎస్.ఎల్.సి. ప్యాసు అయ్యారు. పీయూసీలో చేరడానికి కాలేజీకి వెళ్లారు. వయసు తక్కువని ప్రిన్సిపాలుడు ఓ సంవత్సరం ఆగిరా నాయినా అన్నారట.

ఇంట్లో లేమి... వచ్చే సంవత్సరం వరకు ఆగితే కాలేజీ అవకాశం వస్తుందో రాదో... సంవత్సరం చదువు లేకుండా డబ్బు లేకుండా ఎట్లా వుండాలి?

సరే తాలూకా ఆఫీసు దగ్గర దస్తావేజులు రాసే పెంచలయ్య అనే వ్యక్తి దగ్గర పనికి కురిరారట. పనేమిటంటే ఓ రెండు ఫర్లాంగుల దూరంలో వున్న బస్టాండులో నిలబడి... దిగే ప్యాసింజర్లతో క్రయవిక్రయాలకు వచ్చే పార్టీలను గుర్తుపట్టి వాళ్లను ఒప్పించి దస్తావేజులు రాయించడానికి పెంచలయ్యగారి దగ్గరికి తీసుకురావాలి.

ఆ రోజుల్లో తాలూకాఫీసూ, సబ్ రిజిస్ట్రారాఫీసూ, పోలీస్టేషన్లూ, సబ్‌ట్రెజరీ ఒకే ప్రాంగణంలో వుండేవి.

"ఈ రోజుకీ బస్టాండులో నిక్కరు వేసుకొని పార్టీలను గుర్తిస్తున్నట్టే వుందయ్యా" అని మా బావ, తన పీయూసీ ఆ తర్వాత ఇంజనీరింగ్ ఎట్లా కష్టాలు పడి చదివిందీ చెప్పుకొచ్చారు.

దొంగతనంగా హాస్టల్లో వుండటం, దొంగతనంగా మెస్సులో తినడం... ఆ తర్వాత వార్డెన్తో, గుర్తించబడి కట్టడానికి డబ్బు లేక... ఒక సంవత్సరం డిస్‌కంటిన్యూ చేయడం... అన్నీ వివరంగా చెప్పుకొస్తూ,

"ఆ సమయంలో డబ్బు కోసం నేను చేయని పని లేదయ్యా" అని నిజాయితీ వ్యక్తబరిచారు మెహనరావు బావ.

అవన్నీ యిక్కడ ఏకరువు పెట్టలేను.

ఈ రోజున మా బావగారు ఓ నిజాయితీపరుడైన ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా రిటైరయ్యారు.

"డబ్బూ దరిద్రమూ రెండు సవతులయ్యా... ఒకదాన్నొకటి ఏమైనా చేయగలవు" అన్న మా బావ మాట నవ్వుతూ ఒప్పుకున్నాను. ఇది చెప్పడమెందుకంటే డబ్బు మనిషితో ఎంతపనైనా చేయిస్తుందీ అన్డానికే.

ఆలోచిస్తే భర్తృహరీ మా బావా చెప్పింది నిజమే కదా అనిపిస్తుంది.

చాలా కొద్ది మందిలో మినహాయిస్తే జాతీ, సుగుణాలూ, శీలమూ, వంశమూ, శౌర్యమూ, ఈ గుణాలన్నీ డబ్బు లేకుంటే 'ప్చ్' వ్యాల్యూలెస్.

Man Made Money, and then Money Started Making Man. ●